సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 30 । జూన్ । 2023



రోడ్లపైనే విక్రయాలు

ఎల్లారెడ్డి పట్టణంలో రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

- 9లో ▸



బస్‌పాస్‌ల పంపిణీకి..

విద్యాలయాలు ప్రారంభమైన సందర్భంగా స్టూడెంట్లకు బస్‌పాస్‌లు ఇచ్చేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

- 9లో ▸

గరిష్టం/కనిష్టం
31.3 /24.5

వాతావరణం

ఆకాశం ఉదయం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. చిరుజల్లులు కురిసే అవకాశముంది. సాయంత్రం మోస్తరు వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



ఎల్లారెడ్డి : కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డిని నియమించినట్లు రాష్ట్ర కిసాన్‌సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి తెలిపారు. గురువారం కాంగ్రెస్ నాయకులు షబ్బీర్ అలీ చేతుల మీదుగా శ్రీనివాస్‌రెడ్డికి నియామకపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సుభాష్‌రెడ్డి తదితరులున్నారు.

వర్గీకరణ సాధించే వరకు పోరాటం



బాన్సువాడ : ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు నిరంతరం పోరాటం చేస్తున్నే ఉంటామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ అన్నారు. గురువారం పట్టణంలోని దుర్గామాత ఫంక్షన్ హాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధన ద్వారా మాత్రమే మాదిగలు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. జూలై చివ రి వారంలో హైదరాబాద్ కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘ నంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు డల్లా సురేష్ మహాజన్, నాయకులు శ్రీకాంత్, శివరాజ్, విజయ్, సురేష్, బాల్‌రాజ్, పురుషోత్తం, పద్మారావు తదితరులున్నారు.

మోదీ సంకల్పాన్ని నెరవేర్చాలి



దోమకొండ : ప్రతీ బూత్‌లోనూ బీజేపీ బలంగా చేయాలనే పీఎం మోదీ సంకల్పాన్ని ప్రతిఒక్కరూ నెరవేర్చాలని తమిళనాడుకు చెందిన బీజేపీ ఇన్‌చార్జి మరియప్పన్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ అనే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో కష్టపడి పార్టీని పటిష్టంగా తయారు చేయాలన్నారు. ఎన్నికల్లో కామారెడ్డిలో బీజేపీ విజయఢంకా మోగించాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జహీరాబాద్ ఇన్‌చార్జి మహేశ్, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు చింతల రాజేశ్, భూత్ అధ్యక్షుడు కాశిరెడ్డి, నాయకులు రవీందర్ రెడ్డి, కొండల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, రవి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి : నిజామాబాద్ రీజియన్‌లో డయల్ యువర్ ఆర్టీసీ ప్రోగ్రాం శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎం ఉషాదేవి తెలిపారు. ప్రయాణికులు సూచనలు, ప్రయాణంలో కలిగిన ఇబ్బందులపై కింది నంబర్లకు వాట్సాప్ మెసేజ్ చేయాలని సూచించారు.

ఆర్‌ఎం, నిజామాబాద్	9959226011
డీఎం, ఆర్మూర్	9959226019
డీఎం, బోధన్	9959226001
డీఎం, నిజామాబాద్-1	9959226016
డీఎం, నిజామాబాద్-2	9959226017
డీఎం, కామారెడ్డి	9959226018
డీఎం, బాన్సువాడ	9959226020

కామారెడ్డి కలెక్టరేట్‌లో ఆందోళన చేస్తున్న నందివాడ డ్వాక్రా మహిళలు (ఫైల్)



పోరుబాటలో.. డ్వాక్రా మహిళ

మహిళల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు అందిస్తున్నారు. అయితే తీసుకున్న రుణాలను సకాలంలో మహిళలంతా కడుతున్నప్పటికీ మధ్యవర్తులు వాటిని బ్యాంకుల్లో జమ చేయకపోవడంతో వారికి తీరని అన్యాయం జరుగుతోంది. మధ్యవర్తుల నుంచి ఈ డబ్బుల రికవరీ కోసం మహిళలంతా ఏకంగా పోరుబాట పట్టారు.

– సాక్షి, కామారెడ్డి

- కిస్తీ డబ్బుల రికవరీ కోసం ఆందోళనలు
- రూ. 60 లక్షలకు పైగా దుర్వినియోగం
- నందివాడలో వీవోఏ ఇంటికి తాళం
- హసన్‌పల్లిలోనూ నిరసనలు
- అధికారులకు సవాల్‌గా మారిన రికవరీ

గ్రామాల్లో డ్వాక్రా మహిళలు రుణాల చెల్లింపుల్లో ఖచ్చితంగా ఉంటున్నారు. తాము తీసుకున్న రుణాలతో కుటీర పరిశ్రమలు, కుల వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటున్నారు. తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అయితే కొన్ని చోట్ల ఐకేపీ సిబ్బంది, బిజినెస్ కరస్పాండెంట్ పాయింట్ల నిర్వాహకులు మహిళల నుంచి తీసుకున్న డబ్బులను ఖాతాల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకున్న సంఘటనలు మహిళల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. జిల్లాలో 16,957 సంఘాల్లో 1,75,647 మంది సభ్యులు ఉన్నారు. ప్రతీ ఏటా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలను, స్త్రీ నిధి రుణాలను అందిస్తోంది. వాటితో వివిధ వ్యాపారాలు చేస్తూ నాలుగు డబ్బులు సంపాదిస్తున్నారు. కొందరు వ్యవసాయ పనులకు, భూములు అభివృద్ధికి వాడుకుంటున్నారు. నెలనెలా వాయిదాలు చెల్లిస్తూ ముందుకు సాగుతున్నారు.

కలెక్టరేట్‌కు తరలివచ్చి..

నిధులు దుర్వినియోగం జరిగిన నందివాడ, హసన్‌పల్లి గ్రామాల్లో మహిళలు వివిధ పద్ధతుల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నందివాడలో అయితే నిధులు కాజేసిన వీవోఏ ఇంటికి తాళం వేశారు. ఇంటి ముందు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి నిందితుని నుంచి రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. హసన్‌పల్లిలో మహిళలు తమ డబ్బులు తమకు ఇప్పించాలని మండల కార్యాలయానికి తరలివచ్చి స్థానిక ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. కాగా దుర్వినియోగమైన డబ్బులను రికవరీ చేయడం అధికారులకు సవాల్‌గా మారింది. నిందితులపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయడం, ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగించి రికవరీ చేయడానికి అవకాశాలున్నాయి.

జిల్లావ్యాప్తంగా ఆడిట్ షురూ..

డ్వాక్రా మహిళలకు సంబంధించిన డబ్బులు దుర్వినియోగం వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు సంఘాల వారీగా ఆడిట్ మొదలుపెట్టారు. ఈనెల 15 నుంచి ఆడిట్ మొదలైంది. ఇప్పటి వరకు దాదాపు 120 సంఘాల ఆడిట్ పూర్తి చేశారు. అన్ని సంఘాలను వీలైనంత త్వరగా ఆడిట్ చేసి రుణాలు, చెల్లింపులు, నిల్వ అంశాలపై నివేదికలు తయారు చేయనున్నారు. ఆడిట్ ద్వారా ఇంకా ఏమైనా అక్రమాలు జరిగాయా అన్నది తేలనుంది. మహిళలకు సంబంధించిన డబ్బులు దుర్వినియోగం జరిగిన రెండు సంఘటనలు వెలుగు చూసిన నేపథ్యంలో అధికారులు దిద్దుబాటు చర్యలకు సిద్ధమయ్యారు.

వెలుగు చూసిన అక్రమాలివే..

తాడ్వాయి మండలంలోని నందివాడలో వీవోఏగా పనిచేసిన వ్యక్తి 82 మంది మహిళలకు సంబంధించి రూ. 36.91 లక్షలు దుర్వినియోగం చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. దీనిపై మహిళలు ఆందోళనలు చేస్తున్నారు. సంబంధిత వీవోఏ ఇంటికి తాళం వేశారు. మెక్కిన డబ్బులు కక్కించాలని డిమాండ్ చేస్తున్నారు. నిజాంసాగర్ మండలం హసన్‌పల్లిలో డ్వాక్రా మహిళలు బ్యాంక్‌కు సంబంధించి బిజినెస్ కరస్పాండెంట్ సెంటర్ నిర్వాహకురాలికి డబ్బులు చెల్లిస్తూ వెళ్లారు. ఆ డబ్బులను ఖాతాల్లో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు తేలింది. దాదాపు రూ.27 లక్షలు సదరు బిజినెస్ కరస్పాండెంట్ సెంటర్ నిర్వాహకురాలి వద్ద ఉండిపోయాయి.

పవిత్రం.. తొలి ఏకాదశి

బాన్సువాడ : హిందువులకు పవిత్రమైనది తొలిఏకాదశి అని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం తొలి ఏకాదశిని పురస్కరించుకుని బాన్సువాడలోని శాంతినగర్ విఠలేశ్వర మందిరం, బీర్కూర్ మండలం బైరాపూర్ విఠలేశ్వర ఆలయంలో స్పీకర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఆధ్యాత్మికంగా పూజలు చేస్తే మనిషికి ప్రశాంతత లభిస్తుందన్నారు. ఇటీవల మహారాష్ట్రలో సీఎం కేసీఆర్ పండరీపూర్ విఠలేశ్వర స్వామిని దర్శించుకున్నారన్నారు. బాన్సువాడ విఠలేశ్వర ఆలయానికి రూ.10 లక్షలు మంజురు చేశానని, పనులు కూడా పూర్తయ్యాయన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 32 ఆలయాల అర్చకులకు కొత్తగా దూపదీప నైవేద్యం కింద ప్రతి అర్చకుడికి నెలకు రూ.10 వేలు అందుతాయన్నారు. బైరాపూర్ విఠలేశ్వరాల అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ జెట్పీటీసీ ద్రోణవల్లి సతీష్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, మోహన్‌నాయక్, ద్రోణవల్లి సతీష్, మోచి గణేశ్ తదితరులు ఉన్నారు.



బైరాపూర్ విఠలేశ్వర మందిరంలో పూజలు చేస్తున్న స్పీకర్ పోచారం



విఠలేశ్వర మందిరంలో భజనలు చేస్తున్న భక్తులు

గ్రూప్–4 పరీక్షకు సకాలంలో హాజరవ్వాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం : గ్రూప్–4 అభ్యర్థులు జులై 1న జరిగే పరీక్షకు శనివారం ఉదయం 9:45 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. గ్రూప్–4 పరీక్ష రాసే అభ్యర్థులు ఈ క్రింది సూచనలు పాటించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో చెప్పారు. రెండో పేపర్ కోసం శనివారం మధ్యాహ్నం 2:15 గంటల్లోపు అభ్యర్థుల పరీక్ష కేంద్రానికి హాజరుకావాలన్నారు. జులై 1న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రంలో టీఎస్పీఎస్సీ నిబంధనలు పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లదేనన్నారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. బంగారు ఆభరణాలు ధరించవద్దని, అభ్యర్థులు చెప్పులు ధరించి హాజరుకావాలన్నారు. అభ్యర్థులను తనిఖీ చేయడానికి సిబ్బందిని నియమించామన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక ప్రభుత్వ గుర్తింపు కార్డు ఒరిజినల్ తేవాలన్నారు. పరీక్షకు 15 నిమిషాల ముందే పరీక్ష కేంద్రం గేటు మూసి వేస్తారని తెలిపారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కామారెడ్డి టౌన్ : గ్రూప్–4 పరీక్ష అభ్యర్థుల కోసం ప్రత్యేకమైన ఆర్టీసీ బస్సులను నడుపుతున్నట్లు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ లక్కు మల్లేశం తెలిపారు. 40 కేంద్రాల్లో గ్రూప్ 4 పరీక్షలు రాస్తున్న 16,101 అభ్యర్థులకు కామారెడ్డి నుంచి వివిధ ప్రాంతాలకు, వివిధ ప్రాంతాల నుంచి కామారెడ్డి వరకు బస్సులు నడుపుతున్నామన్నారు. బస్టాండ్‌లో హెల్ప్‌డెస్క్ ఉందన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి పరీక్ష సమయం వరకు పరీక్ష ముగిసిన అనంతరం గమ్య స్థానాల బస్సులు ఉంటాయన్నారు. నిజామాబాద్ రూట్‌లో 16, బాన్సువాడ రూట్‌లో 8, నిజాంసాగర్ , ఎల్లారెడ్డి రూట్‌లో 14, గుండారం, మెదక్ రూట్‌లో 5, కరీంనగర్ రూట్‌లో 18, భిక్కనూరు, రామాయంపేట రూట్‌లో 6, దోమకొండ, బీబీపేట రూట్‌లో 9, అన్నారం రామారెడ్డి రూట్‌లో 6, ఆర్మూర్ రూట్‌లో 2, కామారెడ్డి జేబీఎస్ రూట్‌లో 28 బస్సులను అదనంగా ఏర్పాటు చేశామన్నారు.

నోట్‌బుక్కులు అందేదెప్పుడో!

- అరకొరగా సరఫరా
- బుక్‌స్టాళ్లలో కొనుగోలు చేస్తున్న విద్యార్థులు

నిజాంసాగర్ : విద్యా సంవత్సరం ప్రారంభమై పక్షం రోజులు గడిచినా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికీ నోటు బుక్కులు అందలేదు. అరకొరగా సరఫరా కావడంతో విద్యార్థులు మార్కెట్‌లో కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సర్కారే నోటు బుక్కులు కూడా పంపిణీ చేయాల్సి ఉంది.

జిల్లాలో 187 ఉన్నత పాఠశాలలు, 127 ప్రాథమికోన్నత పాఠశాలలు, 697 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 92,014 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అందరికీ ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలతోపాటు నోట్‌బుక్కులూ సరఫరా చేయాల్సి ఉంటుంది. జిల్లాకు 4.5 లక్షల నోట్‌బుక్కులు అవసరం కాగా.. 41,380 మాత్రమే చేరాయి. జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చిన ఈ అరకొర పాఠ్య పుస్తకాలను మండలాల వారీగా పంపిణీ చేశారు. మండలానికి రెండు వేలలోపు నోట్‌బుక్కులు చేరా యి. ఇటీవల తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా అన్ని పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అయితే నోట్‌బుక్కులు అరకొరగా రా వడంతో వాటిని పంపిణీ చేయలేకపోయారు.



నిజాంసాగర్ విద్యాశాఖ కార్యాలయంలో ఉన్న నోట్‌బుక్కులు

తరగతులవారీగా..

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని ఐదో తరగతిలోపు విద్యార్థులకు వర్క్ బుక్కులు పంపిణీ చేయనున్నారు. ఆరోతరగతి విద్యార్థులకు 6 నోట్ బుక్కులు, ఏడో తరగతి నుంచి పదోతరగతివరకు ఒక్కొక్కరికి 7 నోట్ బుక్కుల చొప్పున అందించాల్సి ఉంది. కానీ అరకొరగానే నోట్‌బుక్కులు రావడంతో విద్యార్థులు బుక్‌స్టాళ్లలో కొనుక్కోవాల్సి వస్తోంది. ఈ విషయమై డీఈవోను ఫోన్ ద్వారా సంప్రదించడానికి 'సాక్షి' యత్నించగా.. ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

తీరనున్న తాగునీటి కష్టాలు

- అమృత్ 2.0 పథకానికి బాన్సువాడ మున్సిపాలిటీ ఎంపిక
- రూ. 52 కోట్ల నిధులు మంజూరు
- బల్దియా, విలీన గ్రామాల్లో తొలగనున్న సమస్య

బాన్సువాడ : మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమృత్ 2.0 పథకానికి బాన్సువాడ మున్సిపాలిటీని ఎంపిక చేశారు. ఈ మేరకు రూ. 52 కోట్ల నిధులు మంజూరయ్యాయి. టెండర్ కూడా పూర్తయ్యింది. ఈ నిధులతో మరో 30 ఏళ్ల వరకు తాగునీటి సమస్య తలెత్తకుండా పనులు చేపట్టనున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీలో కొయ్యగుట్ట, తాడ్కోల్‌లో సగభాగం, టీసీ కాలనీ, కొయ్యగుట్ట తండా విలీనమయ్యాయి. వీలిన గ్రామాల్లో కొంత వరకు తాగునీటి సమస్య ఉంది. అమృత్ 2.0 పథకంలో మంజూరైన రూ.52 కోట్ల ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు, పట్టణంలోని కొన్ని కాలనీల సమస్యలు పరిష్కారం కానున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 50 వేల పైనా జనాభా ఉండగా 9200 గృహాలు ఉన్నాయి. పట్టణంలో ప్రస్తుతం పట్టణంలో 21 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. 100 కి.మీ మేర పైపులైన్ ఏర్పాటు చేశారు. అమృత్ 2.0 పథకం ద్వారా 18 లక్షల సామర్థ్యమున్న వాటర్ ట్యాంకుకు అనుసంధానంగా 7 లక్షల సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు, మరో 5 లక్షల సామర్థ్యమున్న 4 వాటర్ ట్యాంకులు నిర్మించనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో కొంతకాలంగా వెలుస్తున్న రియల్ వెంచర్ల వల్ల నీటి సమస్య ఉత్పన్నమవుతుంది. వెంచర్‌దారులే ప్రతి ఇంటికి నీటి సౌకర్యం వసతి కల్పించాల్సి ఉండగా వారలా చేయట్లేదు.



బాన్సువాడ పట్టణం

ఇవీ ప్రతిపాదనలు..

అమృత్ 2.0 పథకం ద్వారా మంజూరైన నిధులతో మున్సిపాలిటీలో కింద పనులు చేపట్టనున్నారు. నూతనంగా 18 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న 1 ఓవర్‌హెడ్ ట్యాంకు, 7 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు, 5 లక్షల లీటర్ల సమర్థ్యం గల నాలుగు ట్యాంకులు నిర్మించనున్నారు. ఇంటింటికి నీటిని సరఫరా చేసేందుకు 90 నుంచి 100 కిలోమీటర్ల పైపులైను వేయనున్నారు.

అదే విధంగా 6 వేలకు పైగా నల్లా కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పిలిచారు. టెండర్ ప్రక్రియ నేటితో ముగియనుంది. వచ్చేనెలలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

సమస్య తీరనుంది..



అమృత్ 2.0 పథకంలో మున్సిపాలిటీ ఎంపిక కావడంతో నీటి సమస్య పూర్తిగా తీరనుంది. ఇప్పటికే సీఎం కేసీఆర్ నేతృత్వంలో స్పీకర్ పోచారం సహకారంతో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నీటిని అందిస్తున్నాం. అమృత్ 2.0 పథకం ద్వారా వాటిల్లోనూ సమస్యలు తీరుస్తాం.

– జంగం గంగాధర్, మున్సిపల్ చైర్మన్ బాన్సువాడ

టెండర్ పూర్తి కాగానే..



బల్దియాలో అమృత్ 2.0 ద్వారా రూ. 52 కోట్లు విడుదలయ్యాయి. చేపట్టాల్సిన పనులను పబ్లిక్ హెల్త్ వర్క్స్ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేశాం. టెండర్ పూర్తి కాగానే పనులు చేపడతాం. – రమేశ్,కమిషనర్, బాన్సువాడ

భక్తిశ్రద్ధలతో బక్రీద్



బాన్సువాడలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు స్పీకర్ పోచారం, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



ముజీబొద్దీన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న గంపగోవర్ధన్



షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గంప కృష్ణ

కాశీలో నృత్యోత్సవం

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సనాతన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో కాశీలోని అన్నపూర్ణ దేవాలయం, గంగానది అస్సీ ఘాట్‌లో కళాకారిణులు గురువారం నృత్యప్రదర్శననిచ్చారు. కామారెడ్డితో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన 150మంది కళాకారిణులు ప్రదర్శనలో పాల్గొన్నారని సంస్థ నిర్వాహకుడు నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

– కామారెడ్డి అర్బన్



జాతీయ నృత్య సమ్మేళనంలో పాల్గొన్న కళాకారులు

క్లుప్తంగా

రుద్రూర్‌వాసికి డాక్టరేట్


విశ్వనాథ్

రుద్రూర్: రుద్రూర్‌కు చెందిన విశ్వనాథ్ వహాజన్ ఫిలాసఫీ సబ్జెక్టులో 'విద్యలో అద్వైత వేదాంత తత్వ జ్ఞానం' గురించి చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల డీన్ కృష్ణారావు పర్యవేక్షణలో ఆయన పరిశోధన చేశారు.

కనీస వేతనాలు అమలు చేయాలి



ఖలీల్‌వాడి: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నగరంలోని శ్రామికభవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వనమాల కృష్ణ మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కార్మిక అనుకూల చట్టాలను రద్దుచేసి పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా చట్టాలను తీసుకొస్తుందని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేసేందుకు ఉద్యమించాలన్నారు. త్వరలో హైదరాబాదులో భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్, జిల్లా అధ్యక్షుడు ముత్తన్న, ప్రధాన కార్యదర్శి సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-4 పరీక్ష కోసం ప్రత్యేక బస్సులు

నందిపేట్/ఆర్మూర్‌టౌన్/బోధన్: టీఎస్‌పీఎస్సీ జూలై 1న నిర్వహించనున్న టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్ 4 పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఆర్మూర్, బోధన్ నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్మూర్, బోధన్ ఆర్టీసీ డిపోల మేనేజర్లు కవిత, టీఎస్ స్వామి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు, మెట్‌పల్లి వైపు, నిజామాబాద్ వైపు ప్రత్యేక బస్సులు ఉంటాయన్నారు. అలాగే ఆర్మూర్ నుంచి పిప్రి జూనియర్ కళాశాల, క్షత్రియ కాలేజీ పరీక్ష కేంద్రాల వరకు ఉదయం 6 గంటల నుంచి పరీక్ష సమయం వరకు, పరీక్ష ముగిసిన అనంతరం ప్రత్యేక బస్సులు నడిపిస్తామని తెలిపారు. అలాగే బోధన్ నుంచి నిజామాబాద్, నిజామాబాద్ నుంచి బోధన్, పోతంగల్ నుంచి బోధన్, బోధన్ నుంచి బాన్సువాడ, బాన్సువాడ నుంచి బోధన్ వరకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బస్టాండుల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు.

రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడపొద్దు

సిరికొండ: పొలాలను దున్నడానికి ఉపయోగించే కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై నడపొద్దని ధర్పల్లి సీఐ సైదా సూచించారు. మండలకేంద్రంలో గురువారం ఆయన మాట్లాడారు. రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను తిప్పడం వల్ల తారు లేచిపోయి రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నారు. దమ్ము చక్రాలకు ఇనుప పట్టీలను బిగించుకోవాలని తెలిపారు. తారు రోడ్లపై కనిపించే కేజ్‌వీల్స్ ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు సహకరించాలని కోరారు.

వరద కాలువకు 30 ఏళ్లు

- కాలువకు శంకుస్థాపన చేసిన నాటి ప్రధాని పీవీ
- 2010 నుంచి నీటి విడుదల
- పునరుజ్జీవనంతో మారిన స్వరూపం


వరద కాలువ హెడ్ రెగ్యులేటర్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ మిగులు జలాలను సద్వినియోగం చేసుకోడానికి నిర్మించిన వరద కాలువకు నేటి(శుక్రవారం)తో 30 ఏళ్లు పూర్తవుతాయి. ప్రాజెక్ట్ నిండుకుండల మారిన తర్వాత మిగులు జలాలను వరద గేట్ల ద్వారా గోదావరిలోకి వదిలేయాల్సి వస్తుండేది. అలా గోదావరిలోకి వదలకుండా పాత కరీంనగర్, నల్గొండ, వరంగల్ జిల్లాలోని 2 లక్షల 20వేల ఎకరాల మెట్ట భూములకు నీరందించేందుకు కాలువకు రూపకల్పన చేశారు. ఈ కాలువకు అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ముప్కాల్ శివారులో 1993 జూన్ 30న శంకుస్థాపన చేశారు. ఏడేళ్లలో వరద కాలువ పనులు పూర్తి చేసేలా అగ్రిమెంట్‌తో టెండర్ నిర్వహించి పనులు ప్రారంభించారు. కానీ సకాలంలో పూర్తి కాలేవు.

కాలువ స్వరూపం

ప్రాజెక్ట్‌లో సముద్ర మట్టం1070 అడుగుల వద్ద ఆరు గేట్లతో వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్ నిర్మించారు. అక్కడి నుంచి కరీంనగర్ జిల్లా పెద్దవాగు-2, కోరుట్ల వరకు 22 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ తవ్వి పెద్దవాగు నుంచి నీటిని దిగువ మానేరు డ్యాంకు సరఫరా చేపట్టే విధంగా కాలువను నిర్మించారు. 22 వేల క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో నిర్మాణం జరిగింది. ప్రాజెక్ట్‌లో 1074 అడుగుల నీటి మట్టం ఉన్నంత వరకు ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వార నీటి విడుదల చేపట్టే విధంగా హెడ్ రెగ్యులేటర్ నిర్మించారు.

'పునరుజ్జీవనా'నికి ఆధారం

శ్రీరాంసాగర్ మిగులు జలాలను వినియోగించుకోడానికి నిర్మించిన వరద కాలువ ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకానికి ఆధారమైంది. కాళేశ్వరం నుంచి ఎస్సారెస్పీకి ప్రతి రోజు టీఎంసీ చొప్పున నీటిని రివర్స్ పంపింగ్ చేపట్టడానికి మరో కాలువ కాని, పైపు లైన్ కాని అవసరం లేకుండా వరద కాలువనే వినియోగించేలా అధికారులు డిజైన్ చేశారు. ప్రాజెక్టు నిండుగా ఉన్నప్పుడు మిగులు జలాలను వినియోగించడానికి, నీరు లేనప్పుడు రివర్స్ పంపింగ్‌తో జలాశయం నింపడానికి ఈ కాలువ ఉపయోగపడుతుంది.

2010లో ట్రయల్ రన్

వరద కాలువ ద్వారా నీటి విడుదల ట్రయల్ రన్ సుదీర్ఘ కాలం తర్వాత చేపట్టారు. 2010 జూలై 31న ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ రెండు గేట్ల ద్వారా 600 క్యూసెక్కుల నీటిని వదిలి అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రాజెక్ట్ నుంచి 122వ కిలో మీటర్ వరకు నీటి విడుదల చేపట్టి వరద కాలువ కరకట్టల నాణ్యతను పరిశీలించారు. ఎగువ నుంచి భారీగా వరదలు రావడంతో వరద కాలువ ద్వారా ఆ ఏడాది ఖరీఫ్ ముగింపు వరకు నిరంతరం నీటి విడుదలను చేపట్టారు.

గ్రామాల్లో ఇంటెలిజెన్స్ ఆరా

- ఎన్నికలు సమీపిస్తుండటంతో..
- వీడీసీ, కుల సంఘాల సభ్యుల వివరాలు సేకరణ

ఖలీల్‌వాడి: శాసనసభ ఎన్నికలు సమీపిస్తుండడంతో గ్రామాల్లో ఇంటెలిజెన్స్ అధికారులు వీడీసీ, కుల సంఘాలు, రాజకీయ పార్టీలకు చెందిన నేతల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. జిల్లాలోని గ్రామాల్లో ఇంటెలిజెన్స్ పోలీసులు వారం రోజులుగా వివరాలను సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీ, వామపక్షా పార్టీలకు సంబంధించిన వారి వివరాలు వారి ఫోన్ నంబర్లు సేకరించినట్లు తెలిసింది. గ్రామంలో రాజకీయ నాయకుల ప్రభావం ఎవరిది ఎక్కువగా ఉంటుందని ఆరా తీశారు. సంబంధిత లీడర్ ఏపార్టీకి పని చేస్తున్నారు, వారి ప్రభావం ఎన్ని ఓట్లపై పడుతుందని వివరాలను నమోదు చేసుకున్నారు. అంతేకాకుండా గ్రామంలోని సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలకు సంబంధించిన పని విధానంతోపాటు కార్యకర్తలకు ఎలా సహకారం అందించనున్నారనే అంశాలపై వివరాలను గ్రామాల్లో ఇంటెలిజెన్స్ తీసుకున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్‌లో గ్రూపు విభేదాలు ఎలా ఉన్నాయి. గ్రామంలో ప్రజలకు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అందుబాటులో ఉంటున్నారని పలు రకాల ప్రశ్నలపై ఆరా తీసినట్లు తెలిసింది. గ్రామంలోని వీడీసీల పని తీరు ఏ విధంగా ఉంది. అందులో ఎవరు ప్రధాన పాత్ర పోషిస్తారు అనే అంశాలపై వివరాలు సేకరించి అందుకు సంబంధించిన వ్యక్తి వివరాలను ఇంటెలిజెన్స్ పోలీసులు సేకరించారు.

గ్రామంలో ఏ కులసంఘాలకు సంబంధించిన సంఖ్య ఎక్కువగా ఉంటుంది అందులో ఎవరికి చెబితే సభ్యులు వింటారనే కోణంలో ఆరా తీసినట్లు తెలిసింది. సంఘంలో ఏ పార్టీలకు చెందిన లీడర్లు ఉన్నారు. కులసంఘాల సభ్యులు ఎంత వరకు వచ్చే ఎన్నికలలో ప్రభావితం చేస్తారనే అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. దీనికి సంబంధించిన వివరాలను ఇంటెలిజెన్స్ పోలీసులు పేర్లు, ఫోన్ నెంబర్లు, వారి పూర్తి వివరాల తోపాటు పార్టీ వివరాలను సేకరించినట్లు తెలి సింది. గ్రామంలో ఉన్న కులసంఘాలకు సంబంధించిన పెద్ద మనుషుల వివరాలను సేకరించారు. దీంతో గ్రామాల్లో ఇంటెలిజెన్స్ అధికారులు వివరాలు సేకరించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. డిసెంబర్‌లో శాసనసభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో గ్రామాల వారీగా ఇంటెలిజెన్స్ ద్వారా వివరాలు సేకరించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అభివృద్ధిపై ప్రశ్నించినందుకే..

- నా కుమారుడిపై ఎమ్మెల్యే హత్యాయత్నం కేసు బనాయించారు
- ఖురాన్ నెత్తిన పెట్టుకుని ఓ తండ్రి ఆవేదన


ఖురాన్ నెత్తిన పెట్టుకున్న అబ్దుల్ బాకీ

బోధన్‌టౌన్: బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డుతో పాటు ఎంఐఎం వార్డుల్లో అభివృద్ధిపై ఎమ్మెల్యే షకీల్‌ను ప్రశ్నించినందుకే తన కొడుకుపై హత్యాయత్నం కేసు బనాయించి సతాయిస్తున్నారని పట్టణ శివారులోని ఈద్గాలో ఓ తండ్రి ఖురాన్ నెత్తిన పెట్టుకొని రోధించాడు. గురువారం బక్రీద్ సందర్భంగా పట్టణ శివారులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి వచ్చిన 31వ వార్డు కౌన్సిలర్ మహమ్మదీ బేగం భర్త అబ్దుల్ బాకి ఈద్గాలో ఖురాన్‌ను నెత్తిన పెట్టుకొని ప్రమాణం చేస్తూ తన ఆవేదనను వ్యక్తం చేశారు. తన కొడుకు అల్తాఫ్ 15 రోజుల క్రితం రెంజల్ బేస్ కాలనీకి అభివృద్ధి పనులకై వచ్చిన ఎమ్మెల్యేను అడ్డుకొని తమకు నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారని, దీంతో అక్కసు పెంచుకున్న ఎమ్మెల్యే తప్పుడు కేసులు నమోదు చేయించి ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. అక్కడే ఉన్న మత పెద్దలు ఆయనను సముదాయించారు.

ఆ ఇద్దరు వ్యక్తులకు నేర చరిత్ర

- బోధన్ ఎమ్మెల్యే షకీల్

బోధన్: తనపై దాడి, హత్యాయత్నం ఘటన కేసులో జైలులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు నేర చరిత్ర ఉందని, వీరిపై 10 చొప్పున పోలీస్ కేసులు ఉన్నాయని బోధన్ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. గురువారం బోధన్ శివారులోని ఈద్గా వద్ద నిందితుడు అల్తాఫ్ తండ్రి ఖురాన్ తలపై పెట్టుకొని తన పిల్లలు ఏ తప్పు చేయలేదని, ఎమ్మెల్యే తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపారని ఆరోపించారు. ఈ ఘటన ఎమ్మెల్యే స్పందించారు. గురువారం రాత్రి వీడియో విడుదల చేశారు. సదరు ఉన్న వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలకు, అరాచకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, మీర్ నజీర్ అలీ(డబ్బు), మరో నాయకుడు షరీఫ్‌తో కలిసి అల్తాఫ్, నవీద్ ముఠాగా తన హత్యకు కుట్ర చేశారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వ్యక్తులపై పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపాలని పోలీసులను కోరారు.

అభివృద్ధి, సమస్యలు గాలికొదిలేసిన ఎమ్మెల్యే


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తదితరులు


సుభాష్‌నగర్: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలు, అభివృద్ధిని ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా గాలికొదిలేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. గురువారం నగరంలోని 27వ డివిజన్ రేణుకనగర్, ఆనంద్‌నగర్‌లో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ చిరంజీవి ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధన్‌పాల్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. బీజేపీ నుంచి గెలుపొందిన కార్పొరేటర్లు కూడా అభివృద్ధి పేరు చెప్పి పార్టీ మారినా.. ఫలితం శూన్యమని, డివిజన్ ప్రజలను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రెండ్రోజుల్లో పార్కు స్థలాలు, కోనేరు స్థలాలను శుభ్రం చేయాలని, లేకపోతే డివిజన్‌వాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని కమిషనర్ చిత్రామిశ్రాకు ఫోన్‌లో హెచ్చరించారు. నాయకులు రంజిత్, వినోద్, సందీప్, శ్రావణ్, సతీష్, నాగరాజు, లక్ష్మీనారాయణ, ప్రభాకర్, మల్లేష్, కిషన్, కిరణ్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో సత్యనాథ్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. జూలై 6లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. తెలుగు, ఇంగ్లిష్, పొలిటికల్ సైన్స్, చరిత్ర, ఎకనామిక్స్, కామర్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, స్టాటిస్టిక్స్, న్యూట్రిషన్, కంప్యూటర్ సైన్స్‌తో పీజీ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పీహెచ్‌డీ, ఎంఫిల్, నెట్, సెట్ ఎస్ఎల్ఈటీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరి అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55శాతం మార్కులు పొంది ఉండాలని సూచించారు. డిగ్రీ, పీజీ కళాశాలల్లో పని చేసిన అనుభవాలను మాత్రమే పరిగణిస్తామని, సర్వీస్ సర్టిఫికెట్లు జత పర్చాలన్నారు. కళాశాల, సబ్జెక్టు అవసరాలను బట్టి మెరిట్ ఆధారంగా అభ్యర్థులను డెమో, ఇంటర్వ్యూకు పిలుస్తామని చెప్పారు. దరఖాస్తులను ఆర్‌సీఓ కార్యాలయం, మునిపల్లిలోని ఎంజేపీ డిగ్రీ కళాశాల, జంగంపల్లిలోని ఎంజేపీ పాఠశాలల్లో పొందవచ్చన్నారు. ఉమ్మడి జిల్లాలో మునిపల్లి, నిజామాబాద్, కామారెడ్డిలో డిగ్రీ కళాశాలలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను ఆర్‌సీవో కార్యాలయంలో, ఎంజేపీ డిగ్రీ కళాశాలలో సమర్పించాలని సూచించారు. వివరాలకు 7981710647, 6302342448 (ఆర్‌సీవో కార్యాలయం), 9989353153 (జంగంపల్లి ప్రిన్సిపాల్), 9948559189 (విజయ్‌కుమార్ ప్రిన్సిపాల్)ను సంప్రదించాలని సూచించారు.

తేలిన రామలింగేశ్వర స్వామి గుడి శిఖరం

- తెప్పపై వెళ్లి పూజలు నిర్వహించిన మత్స్యకారులు
- ఇక్కడ రాముడే స్వయంగా ఇసుక లింగాన్ని ప్రతిష్ఠించారని చరిత్ర


చిన్నయానం వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో తేలిన గుడి శిఖరం


గుడి శిఖరానికి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహిస్తున్న చిన్న గంగారాం

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఎస్సారెస్పీలో ముంపునకు గురైన కుస్తాపురం రామలింగేశ్వర స్వామి గుడి శిఖరం తేలింది. వేసవికి ఎస్సారెస్పీలో నీళ్ల తగ్గడంతో గుడి శిఖరం బయటపడింది. డొంకేశ్వర్ మండలం చిన్నయానం బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఈ గుడి ఉండగా, కొన్నేళ్లుగా ముంపులోనే ఉంది. అయితే, ఈ గుడిలో ఉన్న లింగానికి ఒక ప్రత్యేకత ఉంది. త్రేతాయుగంలో రాముడు సీతతో కలిసి గోదావరి పరివాహక ప్రాంతంలో సంచరించినట్లు ఇక్కడి చరిత్ర చెబుతోంది. గోదావరి నది ఒడ్డున రాముడే స్వయంగా ఇసుకతో శివలింగాన్ని చేతితో తయారు చేసి ప్రతిష్ఠించాడని, దీనినే సైకత లింగముగా పిలుస్తారని స్థల పురాణం. అయితే, పూర్వంలోనే కుస్తాపురం గ్రామం ఇక్కడ ఏర్పడింది. రాముడు చేసిన శివలింగానికి రాతితో గుడి కట్టినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. వందేళ్ల క్రితమే కుస్తాపురం ఊరితో పాటు గుడి కూడా ముంపునకు గురైంది. ప్రతి పన్నెండేళ్లకోసారి నీళ్లు మొత్తం తగ్గిపోయి గుడి పూర్తిగా తేలుతుందని, మండలంలోని చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఎక్కడెక్కడి నుంచో ప్రజలు వచ్చి సైకత లింగాన్ని దర్శించుకుని పూజలు నిర్వహిస్తారని స్థానికులు చెబుతున్నారు. చివరి సారిగా 2019లో గుడి పూర్తిగా తేలింది. మళ్లీ ఇప్పటి వరకు బయట పడలేదు. ప్రస్తుతం శిఖరం తేలడంతో నీళ్లు మరింత తగ్గి గుడి కూడా బయట పడే అవకాశాలున్నాయని డొంకేశ్వర్ మండల గ్రామాల జాలర్లు, ప్రజలు పేర్కొంటున్నారు. అయితే, జీజీ నడ్కుడకు చెందిన మత్స్యకారుడు చిన్న గంగారాంతో పాటు మరికొందరు జాలర్లు నీటిలో రెండు కిలోమీటర్ల మేర తెప్పపై ప్రయాణించి గుడి శిఖరానికి కొబ్బరికాయలు కొట్టి ఇటీవల పూజలు నిర్వహించారు.

రేపే బాబ్లీ గేట్ల ఎత్తివేత

- సుప్రీం కోర్టు తీర్పు అమలు
- ప్రస్తుతం బాబ్లీలో కూడా నీరు అంతంతే..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఎగువ భాగాన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం శనివారం ఎత్తేందుకు ఇరు రాష్ట్రాల అధికారులు సిద్ధమవుతున్నారు. శ్రీరాంసాగర్‌కు ఎగువన 80 కిలోమీటర్ల దూరంలో ధర్మాబాద్ సమీపంలో బాబ్లీ ప్రాజెక్టను మహారాష్ట్ర సర్కారు నిర్మించింది. దీంతో శ్రీరాంసాగర్‌లోకి ఎగువ నుంచి వచ్చే వరదలకు అడ్డుకట్ట పడుతుందని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీంతో న్యాయస్థానం బాబ్లీ ప్రాజెక్టుపై 2013లో తీర్పునిచ్చింది. అప్పటి నుంచి సుప్రీం తీర్పు ప్రకారం ప్రతి సంవత్సరం జూలై 1న గేట్లను ఎత్తాలి. అక్టోబర్ 28న బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లను మూసివేయాలి. అంతేకాకుండా మహారాష్ట్ర పరిసర ప్రాంతాల్లో నిలిచిన నీటికి బదులుగా మార్చి 1న బాబ్లీ గేట్లు ఎత్తి 0.6 టీఎంసీల నీటిని ఎస్సారెస్పీకి ఇవ్వాలని తీర్పులో పేర్కొన్నారు. బాబ్లీ గేట్ల ఎత్తివేత, మూసివేతలో మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారులతో పాటు సీడబ్ల్యూసీ(సెంట్రల్ వాటర్ కమిషన్) అధికారులు పాల్గొని తీర్పును అమలు చేయాలి. సుప్రీం తీర్పు ప్రకారం జూన్ 30న అర్ధరాత్రి దాటాక 12 గంటల నుంచే గేట్లను ఎత్తివేయాలి. కానీ త్రిసభ్య కమిటీ సభ్యులు ఆ సమయంలో వెళ్లడం కుదరకపోవడంతో జూలై 1న ఉదయం గేట్లను ఎత్తుతున్నారు.

ఎగువన ఉన్న ప్రాజెక్టులూ ఖాళీనే..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ప్రధానంగా వరదలు మహారాష్ట్ర ప్రాంతం నుంచి వచ్చి చేరుతాయి. బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరుకు అడ్డుకట్ట తొలిగిపోతుంది. కానీ బాబ్లీ ప్రాజెక్టుతో పాటు, బాబ్లీకి ఎగువన ఉన్న ప్రాజెక్టులు ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతున్నాయి. దీంతో బాబ్లీ గేట్లు ఎత్తగానే ఎస్సారెస్పీలోకి ఇప్పుడే అంతగా వరద నీరు వచ్చే అవకాశం లేదంటున్నారు. బాబ్లీ ప్రాజెక్ట్, ఎగువన ఉన్న విష్ణుపురి, గైక్వాడ్ ప్రాజెక్టులు కూడా ఖాళీగానే ఉన్నాయి. గేట్లు ఎత్తివేతలో ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తరపున ఈఈ చక్రపాణి, ఏఈఈలు పాల్గొంటారని తెలిపారు.

తూటాలతో బహుజన రాజ్యాధికారాన్ని ఆపలేరు



తెయూ(డిచ్‌పల్లి): తుపాకులు, తూటాలతో రాబోయే బహుజన రాజ్యాధికారాన్ని ఎవరూ ఆపలేరని భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీలో భీమ్ ఆర్మీ స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ రావణ్‌పై కాల్పులు జరిపిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ప్రసాద్, ఏఎస్ఏ అధ్యక్షుడు వెంకటరమణ, ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు దినేష్, నాయకులు నరేష్, విశ్వ, రాజేందర్, సిద్దు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆలయంలో చోరీ

మాక్లూర్: మండలంలోని గుత్ప శివారులోని రామాలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఆలయంలో చొరబడి హుండీలోని సొమ్ము ఎత్తుకెళ్లారు. అలాగే గ్రామంలోని అప్పాజీ హోటల్‌లో చొరబడి అందులో ఉన్న సుమారు రూ.7 వేల విలువగల వస్తువులు చోరీ చేశారు.

వివాహిత అదృశ్యం

రెంజల్: మండలంలోని కళ్యాపూర్ గ్రామానికి చెందిన గంగొనే సువర్ణ అదృశ్యమైనట్లు ఎస్సై పండ్ల సాయన్న తెలిపారు. ఈ నెల 26న భర్త రాజుతో కుటుంబ విషయంలో గొడవ పడ్డారని పేర్కొన్నారు. అదే రోజు పుస్తెల తాడు, సెల్‌ఫోన్ ఇంట్లో వదిలిపెట్టి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. చుట్టు పక్కల, బంధువుల ఇళ్లల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం భర్త రాజు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

సీసీఎస్ అదుపులో చీరల దొంగలు?

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రూరల్ మండలం మల్లారం వద్ద గల మేఘన డెంటల్ కాలేజీ సమీపంలో ఇటీవల చీరలు దొంగతనం చేసి వారు సీసీఎస్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. వైజాగ్‌కు చెందిన వారు చీరలు తీసుకొని వస్తుండగా దొంగలు అడ్డగించి రూ.ఐదు లక్షలు విలువ చేసే 90 చీరలను ఎత్తుకెళ్లారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామానికి చెందిన సాయికుమార్ దొంగలకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

గంజాయి పండిస్తే కఠిన చర్యలు



పెద్దకొడప్‌గల్: గంజాయి పండించిన, రవాణా చేసిన కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం మండలంలోని పోచారం తండాలో డీఎస్పీ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనాలు పాటించాలని సూచించారు. సీఐ కృష్ణ, ఎస్సైలు కోనారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కృష్ణరెడ్డి, మురళి పాల్గొన్నారు.

వెనక నుంచి లారీని ఢీకొన్న బైక్

- ఒకరి మృతి, మరో ఇద్దరికి గాయాలు
- లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఘటన


రామ్(ఫైల్)


ప్రమాద స్థలంలో యువకులు

ఇందల్వాయి: లారీ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ యువకుడి నిండు ప్రాణం బలైంది. డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల వస్తున్న బైక్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని దేవితండా గ్రామ పరిధిలోని ఎత్తు తండాకు చెందిన దేగావత్ రామ్(23), బాదావత్ బంతిలాల్, బాదావత్ ప్రవీణ్ ముగ్గురు స్నేహితులు. రామ్ వ్యవసాయం చేసుకుంటుంగా, బంతిలాల్ ఇంటర్ చదువుతున్నాడు. ప్రవీణ్ డిగ్రీ పూర్తికాగా విదేశాలకు వెళ్లడానికి ప్రయత్నిస్తున్నాడు. కాగా వీరు ముగ్గురు కలిసి ఒకే బైక్‌పై గురువారం ఉదయం డిచ్‌పల్లి వైపు వేగంగా వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వైపు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనకాల ఉన్న యువకులు లారీని ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా తలకు తీవ్ర గాయాలైన రామ్ మృతి చెందాడు. బంతిలాల్, ప్రవీణ్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రామ్‌కి ఏడాది క్రితమే పెళ్లవగా అతని భార్య ఇప్పుడు గర్భవతిగా ఉండటంతో ఎత్తు తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని, మృతుడి తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నరేష్ తెలిపారు.

పచ్చలనడ్కుడలో ఇల్లు దగ్ధం



వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడలో గురువారం వేకువజామున శంకర్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు దగ్ధం అయింది. శంకర్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కొన్ని రోజుల క్రితం భార్యా పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. గురువారం తెల్లవారుజామున ఇంట్లో మంటలు అంటుకున్నాయి. మరో గదిలో అద్దెకు ఉంటున్న వారు లేచి బయటకు వచ్చి ప్రాణాలు రక్షించుకున్నారు. స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించగా, సిబ్బంది వచ్చి మంటలను ఆర్పారు. ప్రమాదంలో ఇంట్లోని వస్తువులు పూర్తిగా కాలిపోయి సుమారు రూ. 2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

వడ్డేపల్లిలో ద్విచక్ర వాహనం..

ఎడపల్లి: మండలంలోని వడ్డేపల్లిలో గురువారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని కాలబెట్టారు. గ్రామానికి చెందిన రాజయ్య తన బైక్‌ను బుధవారం రాత్రి ఇంటి వాకిట్లో పార్కింగ్ చేసి పెట్టగా గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పాండేరావు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు : ఒకరి మృతి


అశోక్ (ఫైల్)

బీబీపేట: అతివేగం, అజాగ్రత్తతో కారును నడిపి బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం రాత్రి మండలంలోని జనగామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన కొమ్మెటి అశోక్ (39)కు భార్య స్వర్ణలత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే అశోక్ తన చెల్లెలు భర్త గల్ఫ్‌కు వెళ్తుండడంతో బీబీపేట మండలం ఇస్సానగర్ గ్రామానికి వచ్చాడు. బావను కామారెడ్డిలో బస్ ఎక్కించి తిరిగి ఇస్సానగర్‌కు బయలుదేరాడు. జనగామ శివారు వద్దకు రాగానే దోమకొండ మండలం అంబారిపేటకు చెందిన ఎంపీటీసీ ఫిరంగి రాజేశ్వర్ కారుతో బైక్‌ను ఢీకొన్నాడు. అశోక్ ఎగిరి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై దాడి చేసిన ముగ్గురి రిమాండ్

గాంధారి: మండలంలోని గండివేట్ తండాకు చెందిన మహిళపై గొడ్డలితో దాడి చేసిన ముగ్గురిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. తండాకు చెందిన అంగోత్ రుక్మిణిపై భూమి విషయంలో ఈ నెల 27న గండివేట్ గ్రామానికి చెందిన గూల్ల అంజి, శోభన్ బాబు, కానీయ అలియాస్ కాశీరాం గొడ్డలితో దాడి చేసి గాయపర్చారని రుక్మిణి భర్త మోహన్ ఇచ్చిన ఫిర్యాదు చేశారు. ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దాడికి వినియోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.